

పద్దుపై ఆశలు





పార్లమెంట్ భవనం

- నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్
- కేంద్రం నిధులు ఇస్తేనే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పరుగులు
- ఉమ్మడి జిల్లాలో రెండు రైల్వే ప్రాజెక్టుల మంజూరు కోసం ప్రయత్నాలు
- ఇప్పటికే సర్వేలు పూర్తి చేసి.. డీపీఆర్ సిద్ధం చేసిన అధికారులు
- నవోదయ పాఠశాలలు, నారాయణపేట సైనిక్ స్కూల్ కోసం ప్రతిపాదన
- ఎన్నికల్లో నాయకుల హామీల మేరకు కేటాయింపులు వచ్చేనా?

మహబూబ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం.. తొలి పద్దును మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఎన్నికల వేళ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను తేనున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించి అనేక పనులకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని గతంలో ప్రకటించారని, తర్వాత ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే.. డీపీఆర్ మార్చుకుంటే జాతీయ హోదా వచ్చేదని, ఇప్పుడు కేంద్రం నిధులు ఇచ్చి సహకరిస్తుందని ఎన్నికల సమయంలో బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ప్రస్తుతం నిధుల లేమితో ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.55,086 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ. 31,424.49 కోట్ల మేర పనులు జరిగాయి. రూ.1,915 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చే కేటాయింపులను బట్టి.. రాష్ట్ర ప్రభుత్వం ఈ విడతలో రూ.2,500 కోట్లు పీఆర్‌ఎల్‌ఐకి కేటాయించాలని ఆలోచన చేస్తోంది. నిధుల విషయంలో కేంద్రంపై భారీ ఆశలు ఉన్నాయి. జాతీయ హోదా అంశం ఎలా ఉన్నా.. నిధుల విషయంలో సానుకూలత ఉంటుందని అభిప్రాయం ఉంది. ఇవి కాకుండా రీజనల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) పరిధిలో భూసేకరణ తదితర పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ ఆర్ఆర్ఆర్ నిర్మాణం జరిగే అవకాశం ఉంది. అలాగే ఇటీవలే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిని 12 లైన్లుగా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దానిపై కూడా ఈ బడ్జెట్‌లోనే ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 200 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది.

కొత్త రైల్వేలైన్లు మంజూరయ్యేనా?

రాష్ట్రంలో విస్తృతంగా రైల్వే నెట్‌వర్క్ ఉన్నప్పటికీ.. దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో చాలా తక్కువగా ఉంది. ఏళ్లుగా ఇక్కడ గద్వాల-మాచర్ల, కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్లు మంజూరు చేయాలనే ప్రతిపాదన ఉంది. మూడు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తుండగా.. కొద్దికాలం క్రితం గద్వాల- మాచర్ల లైన్‌కు బదులు, గద్వాల-డోర్నకల్ రైల్వేలైన్‌కు ఫైనల్ లోకేషన్ సర్వేకు కేంద్రం రూ.7 కోట్లు కేటాయించింది. ఈ సర్వే కూడా పూర్తయ్యి.. డీపీఆర్‌ను తయారు చేశారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు కొద్దిరోజుల ముందే ఎఫ్ఎల్ఎస్ పూర్తయినప్పటికీ.. ఆ బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన రాలేదు. ఇప్పుడు పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఈ లైన్‌కు నిధుల మంజూరుపై ఆశలు చిగురిస్తున్నాయి. రూ.5,330 కోట్లతో చేపట్టనున్న ఈ లైన్‌ను 296 కిలోమీటర్ల మేర విస్తరించనున్నారు. దీనివల్ల టైర్ 3 నగరాలకు కనెక్టివిటీ పెరిగి.. వ్యాపార రంగం విస్తరించే అవకాశం ఉంది. ఇప్పటికే గద్వాల నుంచి ఆరేపల్లి వరకు 7.8 కిలోమీటర్ల రైల్వేలైన్ ఉండగా.. అక్కడి నుంచి నూతన లైన్ భూత్పూరు, కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, నాంపల్లి, నల్గొండ, భీమవరం, సూర్యాపేట, మోతె, పాలేరు, కుసుమంచి మీదుగా డోర్నకల్‌కు చేరుతుంది. అయితే ఇందులో భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాగా.. నిర్మాణ ఖర్చు మొత్తం కేంద్రమే భరించనుంది. అలాగే కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్‌కు కూడా.. రూ.2,196 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ లైన్ ఫైనల్ లోకేషన్ సర్వేకు గతంలోనే ఆదేశించింది. దీనివల్ల రాయిచూరుకు సికింద్రాబాద్ నుంచి ఉన్న 196 కిలోమీటర్ల దూరం 122 కిలోమీటర్లకు తగ్గుతుంది. అలాగే హుబ్లీ, కొల్హాపూర్, గోవాలాంటి ప్రాంతాలకు దూరభారం తగ్గుతుంది. సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా ఉత్పత్తి అయ్యే సరుకును సులభంగా రవాణా చేయొచ్చు. ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కూడా ఈ లైన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం రెండు రైల్వే ప్రాజెక్టులకు మంజూరు లభిస్తే పారిశ్రామికంగా, వ్యాపారపరంగా మేలు జరిగే అవకాశం ఉంటుంది.



విద్యాపరంగా ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక విద్యా సంస్థల ఏర్పాటు అత్యంత అవసరం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ పాలసీని తీసుకొచ్చే పనిలో ఉండగా.. కేంద్రం నుంచి కూడా పలు విద్యాసంస్థల ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇదివరకే వీటిపై సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాలు కూడా సమర్పించారు.

సైనిక్, నవోదయ స్కూళ్లు వచ్చేనా?

నారాయణపేట జిల్లాకు గతంలోనే సైనిక్ స్కూల్ ప్రతిపాదన ఉన్నప్పటికీ.. దాన్ని వేరేచోటికి తరలించారని ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపర్చాయి. ఈ బడ్జెట్ సమావేశాల్లో సైనిక్ స్కూల్ ప్రతిపాదన ఉంటుందా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్రతీ కొత్త జిల్లాకు నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం ఎనిమిదేళ్లుగా డిమాండ్ ఉంది. కానీ ఇప్పటివరకు ఆ దిశగా కేంద్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఉమ్మడి జిల్లాలో ఒకే నవోదయ స్కూల్ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉంది. వీటితోపాటు ప్రతీ జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేవలం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఒక కేంద్రీయ స్కూల్ ఉంది. ఈ బడ్జెట్‌లో పలు ప్రాజెక్టులకు కచ్చితంగా నిధులు వస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మగౌరవ ప్రతీక పాపన్న గౌడ్

- విగ్రహావిష్కరణ సభలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి తదితరులు

నాగర్‌కర్నూల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాడిత పీడిత ప్రజల కోసం స్వచ్ఛమైన పోరాటాలు చేసిన సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ బడుగు బలహీన వర్గాలకు ఆదర్శప్రాయుడని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్లుగీత వృత్తిని నమ్ముకున్న గౌడ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారి జీవన విధానం మెరుగుపడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. నాగర్‌కర్నూల్‌లోని పాత ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన గౌడ సంఘం సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గౌడ కులస్తులకు అన్ని కులాలతో సంబంధ బాంధవ్యాలు ఉంటాయన్నారు. తాటి, ఈత కల్లు సంబంధిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా నీరా ఉత్పత్తులను ప్రోత్సహించడం, ఆ వర్గానికి చెందిన వారికి మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించడం వాస్తవమన్నారు. తాను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ కులస్తులకు ఇంకా ప్రాధాన్యం దక్కేలా కృషి చేస్తానన్నారు. బంజరు భూముల్లో ఈత, తాటి వనాలు మరింత విస్తృతంగా పెంచేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ బడుగులకు సాధికారిత కల్పించడమే లక్ష్యమన్నారు. మాజీ ఎంపీ మధుయాష్కీ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ప్రసంగిస్తూ బడుగుల అభ్యున్నతి కోసం అందరూ కృషి చేయాలని, తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే కులనిర్మూలన జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్లు కల్పనాభాస్కర్‌గౌడ్, ఆనంద్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు కొండల్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్యే వంగమోహన్ గౌడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, కార్యదర్శి ప్రతాప్‌గౌడ్, వంగా పకీరయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ బాలగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వంగా లక్ష్మణ్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెబ్బేటి నిరంజన్, గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి పాపన్న గౌడ్

బిజినేపల్లి: నిజాం నవాబుల పరిపాలనలో అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో ఆశాజ్యోతిగా వెలుగొందిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నాయిని బాల్‌రాజు గౌడ్ ఆధ్వర్యంలో బిజినేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్ రెడ్డి, గోరటి వెంకన్న, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డిలతో కలిసి మంత్రి జూపల్లి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ సభ్యుడు స్వామి గౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు నాయినోళ్ల రాంచంద్రయ్య గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, వంగ దామోదర్ గౌడ్, మడ్డి బాల్‌రాం గౌడ్, వంగ శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

అర్హులకు.. గుర్తింపేదీ?

- చేనేత జాతీయ అవార్డులకు అనర్హుల ఎంపిక
- నేత కార్మికులను కాదని మాస్టర్ వీవర్లకు అందజేత
- ఇప్పటి వరకు ఎంపికైన వారిలో వారే అధికం
- అర్హులనే గుర్తించాలని సీనియర్ కార్మికుల డిమాండ్
- ఎంపికైన వారికి రూ.25 వేలు అందజేత.. 60 ఏళ్లు పైబడితే పింఛన్ కూడా



జియో ట్యాగింగ్ మగ్గంపై చీర నేస్తున్న కార్మికుడు

గద్వాల టౌన్, జూలై 22: చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా ఇచ్చే అవార్డుల ఎంపిక నిబంధనల మేర జరగడం లేదని జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన సీనియర్ నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గంపై నేసే అర్హులైన కార్మికులను కాదని మాస్టర్ వీవర్లను ఎంపిక చేస్తున్నారని విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా.. ఎంపిక చేయడం సరికాదని అంటున్నారు. గడిచిన పదేళ్లుగా ఏటా ఆగస్టు ఏడున నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత పనిలో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి, అవార్డులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఇప్పటి వరకు జరిగిన ఎంపికల పట్ల పలువురు సీనియర్ నేత కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం ఎంపికలు చేపట్టాల్సి ఉండగా.. అధికారులు మాత్రం కేవలం దరఖాస్తులను స్వీకరించి, తూతూమంత్రంగా ఎంపికలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అవార్డుకు ఎంపికైన కార్మికుడికి రూ.25 వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేసి, సత్కరిస్తారు. అవార్డు పొందిన 60 ఏళ్లు పైబడిన కార్మికుడికి ప్రభుత్వం పింఛను కూడా అందిస్తోంది. ఈ నేపథ్యంలో వయో వృద్ధులైన కార్మికులు ఈ అవార్డును గౌరవంగా, పింఛనును ఆసరాగా భావిస్తున్నారు.

ఎంపికలపై పెదవి విరుపు

గడచిన పదేళ్ల కాలంలో జిల్లాలో దాదాపు 25 మందికిపైగా అవార్డులు వచ్చాయి. వారిలో అత్యధికులు మాస్టర్ వీవర్లుగా పనిచేస్తున్నారన్నది వాదన. మాస్టర్ వీవర్లను కాకుండా నేత వృత్తిపైనే ఆధారపడి దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న వారిని గుర్తించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన జియో ట్యాగింగ్ మగ్గాలు మూడు వేలకు పైగా ఉన్నాయి. ఒక్కో మగ్గంపై నలుగురు కార్మికులు అనుబంధ విభాగాల్లో పనిస్తుంటారని అంచనా. గద్వాల పట్టణంలో జియె ట్యాగింగ్ మగ్గాల సంఖ్య 280కి పైగా ఉండగా, ఒక్కో మగ్గంపై నేత పనితో పాటు అనుబంధ కార్మికులుగా పనిచేస్తున్న వారి సంఖ్య రెండు వేలకుపైగా ఉంది. మగ్గం పని మాత్రమే కాకుండా, డిజైన్ల రూపకల్పన ఆధారంగా కూడా ఎంపిక జరుగుతుండటంతో మాస్టర్ వీవర్లుగా ఉన్న వారూ లబ్ధి పొందతున్నారంటూ సీనియర్ నేత కార్మికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఇచ్చే అవార్డులకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తులను స్వీరించిన అధికారులు.. అర్హత ఆధారంగా రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీకి పంపేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ కార్మికుల ఆశలు ఏ మేరకు నెరవేరుతాయో వేచి చూడాల్సిందే.

సీనియారిటీని పరిగణించాలి



నేను 60 ఏళ్లుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్నాను. ఇప్పటి వరకు నాకు ఎలాంటి అవార్డు దక్కలేదు. ఎంపికలో అధికారులు వృత్తి అనుభవానికి, వయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీటి తర్వాతే మిగతా అర్హతలకు అవకాశం కల్పించాలి.

- నీలి నాగన్న, సీనియర్ చేనేత కార్మికుడు

క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి



అవార్డు కోసం ఎంపిక చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలి. గతంలో చేసిన పని ఆధారంగా కాకుండా ఇప్పటికీ నేత పనిలో కొనసాగుతున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. కార్మికుల ఆర్థిక స్థితిని కూడా పరిగణించాలి.

- బావండ్ల నాగమ్మ, చేనేత కార్మికురాలు

ఎంపిక బాధ్యత స్క్రీనింగ్ కమిటీదే



చేనేత అవార్డు కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారిని గుర్తించడం, ఆ వివరాలను రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ కమిటీకి అందజేయడం వరకే మా బాధ్యత. రాష్ట్ర ఎంపిక కమిటీ తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరమే అవార్డులకు సిఫార్సు చేస్తుంది. ఇందులో జిల్లాస్థాయి అధికారుల ప్రాత కానీ, ప్రమేయం ఉండదు.

- గోవిందయ్య, చేనేత, జౌళి శాఖల జిల్లా సంచాలకులు

బదిలీతో చివరిరోజు ఆఫీసుకు.. అదే ఆఖరిరోజు

- కలెక్టరేట్‌లో గుండెపోటుతో ఎస్టీవో మృతి
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కలెక్టర్.. కన్నీరుమున్నీరైన మృతుడి పిల్లలు



మృతుడు మోహన్‌రాజ్ పిల్లలను ఓదారుస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి



మోహన్‌రాజ్ (ఫైల్)

మహబూబ్‌నగర్, జూలై 22 : ఆయన సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్టీవో). సుదీర్ఘ కాలంపాటు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని డీటీవో కార్యాలయంలో పని చేశారు. నాలుగు రోజుల క్రితం వనపర్తికి బదిలీ అయ్యారు. ఇక బదిలీపై వెళ్ళనున్న ఆయన చివరిరోజుగా తను ఇంతకాలం పనిచేసిన కార్యాలయానికి వెళ్ళి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకున్నది. వనపర్తికి చెందిన మోహన్‌రాజ్ (54) జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని డీటీవో కార్యాలయంలో ఎస్టీవోగా పని చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఆయన వనపర్తికి బదిలీ అయ్యారు. ఇక చివరిరోజు తను ప్రస్తుతం పని చేస్తున్న డీటీవో కార్యాలయానికి వెళ్ళి అక్కడ బదిలీ కార్యక్రమాలన్నీ ముగించుకురావాలని, ప్రతీ రోజు 11 గంటలకు ఆఫీసుకు వచ్చే ఆయన సోమవారం ఉదయం 9:15 గంటలకే వచ్చారు. కలెక్టరేట్‌లోని డీటీవో ఆఫీసు వద్దకు చేరుకునేసరికి గుండెలో నొప్పి రావడంతో తలుపు దగ్గరే ఆగిపోయారు. కొద్దిసేపు అక్కడే నిలబడ్డారు. నొప్పి ఎక్కువ కావడంతో నిలుచున్నచోటే మూడు, నాలుగుసార్లు చుట్టూ తిరిగి ఆ తరువాత వెల్లకిలా పడిపోయారు. తల గట్టిగా ఫ్లోరింగ్‌ను తగలడంతో తలపగిలి రక్తస్రావమైంది. కొద్దిసేపు కాళ్ళు చేతులు కొట్టుకొని స్పృహ కోల్పోయిన దృశ్యాలు అక్కడి సీసీపుటేజీలో కనిపించాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అప్పటికే పరిస్థితి విషమించింది.. కొద్దిసేపటికి సిబ్బంది గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ విజయేందిర బోయి ఆస్పత్రికి చేరుకొని మోహన్‌రాజ్‌ను చూసి, తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు.

కొడుకు, కూతురు వదిలిపెట్టిన కొద్దిసేపటికే..

కొడుకు హరి, కూతురు సుప్రియ తండ్రిని కలెక్టరేట్ వద్ద వదిలివెళ్ళారు. వారు వెళ్ళిపోయిన కొద్దిసేపటికే తండ్రికి ఇలా జరిగిందని తెలియడంతో హుటాహుటిన జనరల్ ఆసుపత్రికి చేరుకొని తండ్రిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. అప్పటిదాకా కళ్ళముందు నవ్వుతూ వెళ్ళిన తండ్రి జీవచ్ఛవంలా కనిపించడాన్ని తట్టుకోలేకపోయారు. అక్కడే ఉన్న కలెక్టర్ వద్దకు చేరుకున్న పిల్లలు తమ తండ్రిని బతికించండి ఆంటీ అంటూ ప్రాధేయపడటం వారి రోదనలు చూసిన వారందరినీ కంటతడిపెట్టించింది. ఆ సమయంలో కలెక్టర్ కూడా భావోద్వేగానికి లోనయ్యారు. ఆ పిల్లలను ఆమెను ఓదార్చారు. మరోవైపు కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులంతా ఈ ఘటనపై తీవ్ర విచారం వెలిబుచ్చారు. మోహన్‌రాజ్ ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.

వరి నాట్లు ముమ్మరం

వనపర్తి అర్బన్, జూలై 22: వారం రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో వనపర్తి జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ వానలకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. ఆరుతడి పంటల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం, దంతె కొట్టడం వంటి పనులు చేస్తుండగా.. మరోవైపు వరి నాట్లకు కరిగెట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ వానకాలంలో 2,45,953 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు 23,005 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారు. పత్తి అత్యధికంగా 10,792.38 ఎకరాల్లో, ఆ తరువాత రెండో ప్రాధాన్య పంట వరిని 3,862 ఎకరాల్లో నాటారు. అంచనాలో ఇప్పటి వరకు 10 శాతం కూడా పంటలు సాగవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వారం క్రితం వరకు వర్షాలు అంతంత మాత్రంగానే కురవడంతో విత్తనాలు వేసేందుకు రైతులు వెనుకంజ వేశారు.



నాటేస్తున్న మహిళా రైతులు



రాజనగరంలో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు



గొర్రు కొడుతున్న రైతులు



చీరలో నారు గుంజుకెళ్తున్న మహిళలు

పేకాట వ్యవహారంపై రహస్య విచారణ?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల క్రైం, జూలై 22: పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, స్వాధీనం చేసుకున్న డబ్బుల్లో కొంతే చూపుతున్నారని 'స్వాధీనంలో స్వాహా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. ఉండవల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసిన ఘటనపై పలు అనుమానాలు రావడంతో పోలీసుల బృందం రహస్య విచారణ జరిపినట్లు సమాచారం. ఇందులో పేకాట ఆడినవారు అందరు కేసులో ఉన్నారా? లేదా? అనే అనుమానాలు ఈ రహస్య విచారణలో తేలాల్సి ఉంది. ఆ సందర్భంగా ఆటగాళ్ల నుంచి బంగారు ఆభరణాలను కొందరు అధికారులు తీసుకున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆభరణాలు పోయిన వ్యక్తి పేకాట ఆడారా? లేదా? అనే విషయంపై పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. లేదంటే ఆభరణాలను తీసుకొని అతన్ని కేసు నుంచి తప్పించారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఈ విచారణ క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ సత్యనారాయణ సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. పేకాట వ్యవహారంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జోగుళాంబ గద్వాల జిల్లాను పేకాట రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న ఓబీసీ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 22 : బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల యాదయ్య కోరారు. సోమవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల లోపే కులగణన చేసి ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. గొల్లకురుమలకు వందరోజుల్లో రెండవ దశ గొర్రెల యూనిట్లను పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుల అకౌంట్లలో వేస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని తెలిపారు. మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయలేదని విమర్శించారు. ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్ని కూడ నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదన్నారు. ప్రభుత్వం వారం రోజుల్లో స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు, నిరసనలు, దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మెట్టుకాడి శ్రీనివాసులు, మెట్టుకాడి శ్యామ్, అచ్చుగట్ల అంజయ్య, రమేష్, జిల్లా మడుగు శంకర్, రాజేష్ కమ్లేకర్, హరిశంకర్, మోహన్, దాసు, వెంకట్‌స్వామి, దశరథ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



వడ్డె నర్సింహులు

కేటీదొడ్డి, జూలై 22 : విద్యుదాఘాతానికి గురై ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు, ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండాపురం గ్రామానికి చెందిన వడ్డె నర్సింహులు (21) సోమవారం ఉదయం తమ వ్యవసాయ పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నించి పక్కనే కాలువపై ఉన్న మోటార్‌ను ఆన్ చేయడానికి వడ్డే స్వామి మామిడి తోటలో గల 11 కేవీ విద్యుత్ స్తంభం పక్క నుంచి వెళుతూ స్తంభాన్ని తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న ముసురు వర్షానికి విద్యుత్ స్తంభం పూర్తిగా తడిసిపోయి విద్యుత్‌షాక్ రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. మృతుడి తండ్రి గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిట్‌ఫండ్ పేరుతో మోసం

- రూ. 50కోట్లకు పైగా దోపిడీ చేసిన నిర్వాహకుడు సాయిబాబు అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 22 : శ్రీసాయిరాం చిట్‌ఫండ్ నెలకొల్పి అమాయక ప్రజల దగ్గర అధిక వడ్డీ ఇస్తానని మోసం చేసిన ఇటిక్యాల సాయిబాబుతోపాటు మరో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. సాయిబాబు అనే వ్యక్తి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 1995లో శ్రీసాయిరాం ఫైనాన్స్ నెలకొల్పి అమాయక ప్రజలకు అధిక వడ్డీని ఇస్తానని మాయమాటలు చెప్పి డిపాజిట్లు సేకరించుకున్నారు. తక్కువ వ్యవధిలో రెట్టింపు డబ్బులు ఇస్తానని చెప్పి, కొన్ని రోజుల పాటు చెప్పిన విధంగా డబ్బులు ఇచ్చాడు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు ప్రభుత్వపరంగా వచ్చిన డబ్బులను తమ వద్ద డిపాజిట్లుగా సేకరించి చివరికి ఉడాయించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో రూ. 50కోట్లకు పైగా డబ్బులు సేకరించుకుని నాగర్‌కర్నూల్, రాయిచూర్, బిజినేపల్లి మండలాల్లో దాదాపు 20 ఎకరాలకు పైగా తమ కుటుంబ సభ్యుల పేరున భూములు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆధారాలు లభించినట్లు ఎస్పీ వివరించారు. హైదరాబాద్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో ఒక ప్లాటు సాయిబాబు కుటుంబ సభ్యుల పేరా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఇట్టి శ్రీసాయిరాం బాధితులు దాదాపు 1542మంది ఇంత వరకు ఫిర్యాదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇంత వరకు తొమ్మిది కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. సాయిబాబు నిర్వాకంపై నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ కనకయ్యతో పాటు కొంతమంది ఎస్‌ఐలు, పోలీసులు ఒక బృందంగా ఏర్పడి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇటిక్యాల సాయిబాబుతో పాటు అతని కుమారుడు ఇటిక్యాల సాయిదీక్షిత్ తాడూరు మాజీ సర్పంచ్ అనుపటి శ్రీనివాసులు, జీవ వెంక టేశ్వర్లు, ఓర్సు హుసేన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై బాధితులకు సత్వర న్యాయం చేయడానికి న్యాయస్థానం ఆదేశానుసారం వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఏఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, సీఐ కనకయ్య తదితరులు ఉన్నారు.

మద్యం బెల్టు షాపుల నియంత్రణకు

మహిళలు నడుం బిగించాలి

అమరచింత, జూలై 22: ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్న మద్యం బెల్టు షాపుల నియంత్రణకు మహిళలు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల పేర్కొన్నారు. సోమవారం అమరచింత సీపీఎం కార్యాలయంలో జరిగిన ఐద్వా పట్టణ కమిటీ మూడవ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల సమస్యలపై తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తుందని ఆమె అన్నారు. వచ్చేనెల 4న వనపర్తిలో నిర్వహించనున్న ఐద్వా జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో ఆ సంఘం జిల్లా నాయకురాలు అనంతమ్మ, రాజేశ్వరి, వసంత, మంజుల, స్వర్ణ, దేవి, మెర్లిన్, ఇందిరా, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

30పడకలకు ఇద్దరే వైద్యులు

- ఉప్పునుంతల ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొర వైద్యం
- ఇబ్బంది పడుతున్న రోగులు



ఉప్పునుంతల ఆసుపత్రి

ఉప్పునుంతల, జూలై 22 : కార్పొరేట్ ఆసుపత్రిని తలపించేలా ప్రభుత్వం ఆసుపత్రి భవన సముదాయం ఉన్నా సరిపడా వైద్యులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. ఉప్పునుంతల 30పడకల ఆసుపత్రిల్లో నెలకొంది. మొత్తం వైద్య సిబ్బంది 31 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 17 మాత్రమే ఉన్నారు. వీరిలో ముగ్గురు కాంట్రాక్టుగా పని చేస్తుండగా మిగిలిన 14మంది రెగ్యులర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో పీహెచ్‌సీగా ఉన్న ఆసుపత్రిని 30పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కాని వైద్యుల నియామకం చేపట్టలేదు. ప్రతీరోజు 150 నుంచి 200పైగా ఓపీ నమోదు అవుతుంది. చిన్న చిన్న రోగాలకు మాత్రమే ఇక్కడ వైద్యం అందుతుందే తప్పా జఠిలంగా ఉంటే పెద్ద ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సిందే. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బందిని భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో అన్ని పరికరాలు

30 పడకల ఆసుపత్రిలలో ఉండాల్సిన వైద్య పరికరాలు అన్ని ఉన్నా వాటిని ఆపరేటింగ్ చేస్తే టెక్నీషియన్లు లేక నిరుపయోగంగా మారాయి. ఆధునాతన ఆపరేషన్ థియేటర్, కంటి వైద్య పరికరాలు, ఈసీజీ, ఎక్స్‌రే, ల్యాబ్ తదితర వసతులకు సరిపడ్డా సిబ్బంది లేక మూలకు పడేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యసేవలు అందకపోవడంతో ప్రైవేట్ వైపు పరుగులు పెడుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వైద్యులను నియమించాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.

పరుగు పందెంలో విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థి అరవింద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఇటికాల రామరాజుయాదవ్, అధ్యాపకులు

కొల్లాపూర్, జూలై 22 : వన్ కేఎం పరుగు పందెంలో కొల్లాపూర్ విద్యార్థి ప్రథమ బహుమతి పొంది బంగారు పతకం సాధించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్రీయ మూడవ చార్మినార్ చాలెంజ్ ఖేల్ హైదరాబాద్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.అరవింద్ సత్తా చాటాడు. పోటీల్లో బంగారుపతకం సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ ఇటికల రామ రాజుయాదవ్ విద్యార్థిని అభినందించి ప్రోత్సాహకంగా నగదు బహుమతి అంద జేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన టీచర్లు.. కంటతడిపెట్టిన విద్యార్థులు



టీచర్లు పోవద్దంటూ కంటతడిపెడుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 22 : బదిలీపై ఉపాధ్యాయులు పాఠశాల నుంచి వెళ్తుంటే విద్యార్థులు కంటతడిపెట్టారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని ఫతేపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం చోటు చేసుకున్నది. కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల విద్యాసాగర్ , మల్లిఖార్జున్ , మహేష్ , వెంకట్‌రెడ్డి బదిలీ అయ్యారు. వీరికి గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాత్రం టీచర్లు పాఠశాల నుంచి పోవద్దంటూ కన్నీరు పెట్టడంతో ఉపాధ్యాయులు భావోద్వేగానికి లోనైయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుకన్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రంగాపూర్‌లో నల్లబెల్లం పట్టివేత



రంగాపూర్‌లో స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం

అచ్చంపేటటౌన్, జూలై 22: అచ్చంపేట మండలంలోని రంగాపూర్ గ్రామంలో సోమవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు నల్లబెల్లం పట్టుకున్నారు. దాదాపు 1500 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్సై సతీష్ తెలిపారు. నల్లబెల్లం వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నల్లబెల్లంను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ ఉష, నవీన్, ఆంజనేయులు తదితరులున్నారు.

ఆయకట్టుకు నీరు వదలాలి

- చెరువులకు చేరుతున్న జూరాల, భీమా సాగునీరు
- వరి తుకాలకు సాగునీరు విడుదల చేయాలని వేడుకోలు



నీటితో కళకళలాడుతున్న చెరువు

పెబ్బేరురూరల్/శ్రీరంగాపురం,జూలై 22: జూరాల, భీమా ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి మండలంలో చెరువులకు, కుంటలకు చేరుతున్న నీటిని ఆయకట్టుకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్‌లో వరిసాగు సీజన్ ఇప్పటికే నెల రోజులు ఆలస్యమైందని పొలాల్లో దుక్కులు దున్ని వెదజల్లే పద్ధతి, గొర్రు ద్వారా ఇప్పటికే 50 శాతం వరి సాగు చేశారని, సాగులో తాము వెనుకబడ్డామని చెరువుల కింద రైతులు వాపోతున్నారు. తమ భూములు బురద రకం భూములు కావడంతో వెదజల్లే పద్ధతికి పనికి రాకపోవడంతో తాము వరి నాట్లు వేయాల్సి వస్తుందన్నారు. మండలంలో భీమా ద్వారా రంగసముద్రం రిజర్వాయర్‌కు నీరు ఇప్పటికే చేరుకుందని, పెబ్బేరు మండలంలో శాఖాపురం, సూగూరు, రంగాపురం, పెబ్బేరు, కంచిరావుపల్లి, పాతపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల చెరువులకు నీరు వచ్చిందని ఆ నీటిని తూముల ద్వారా వెంటనే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. సాగు నీటి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాగునీటి అధికారులకు నీటి విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ముసురు వర్షాలకు కూలుతున్న మట్టి మిద్దెలు

- ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు వినతి



తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గోవింద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అవుట రాజశేఖర్

కొల్లాపూర్, జూలై 22 : గడిచిన 15రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు పట్టణంలో పురాతన ఇళ్లు, మట్టి మిద్దెలు కూలిపడేందుకు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని బాధిత నివాస గృహాల యజమానులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఇందిరాకాలనీలో పురాతన ఇళ్లు, మట్టి మిద్దెలు ముసురు వర్షాలకు దెబ్బతిన్నాయని, ఇళ్ల పైకప్పు పెచ్చులు రాలిపడుతూ కూలిపోయే స్థితికి చేరుకున్నాయని, నివాస గృహాల్లో బస చేయడం తమకు ప్రమాదకరంగా మారిందని ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసే డబుల్‌బెడ్రూం నివాస గృహాలు మంజూరు చేయాలని పురాతన నివాస గృహాల్లో భయభ్రాంతులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్న ప్రజల ప్రాణాలను కాపాడాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తమ నివాస గృహం ముసురు వర్షాలకు కూలిపోయే స్థితిలో ఉన్నాయని ప్రభుత్వపరంగా దుకోవాలని అవుట రాజశేఖర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గోవింద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

పెబ్బేరులో పెరుగుతున్న భూ వివాదాలు

- భూముల ధరలు పెరగడమే కారణం
- కోట్ల విలువైన భూములకు ఓఆర్‌సీ సర్టిఫికెట్లు
- ఆందోళనలో బాధితులు



పెబ్బేరు శివారులో వివాదంలో ఉన్న భూమి

పెబ్బేరు,జూలై 22: భూముల రెట్లు అమాంతంగా పెరగడంతో మనుషుల్లో అత్యాశ పెరిగి భూ తగదాలకు దిగుతున్నారు. దీంతో నిత్యం వివాదాలు చోటు చేసుకొని కోర్టుల చుట్టూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగు తున్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలో వేణుగోపాలస్వామి ఆలయ భూమి సమస్య కోర్టు పరిధిలో ఉండగానే అలాంటిదే మరొకటి వెలుగులోకి వచ్చింది. కోట్ల విలువ చేసే భూములకు అధికారులు ఓఆర్‌సీలు జారీ చేయడంతో బాధిత రైతులు లబోదిబోమంటూ ఆందోళన చేస్తున్నారు. పెబ్బేరు మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి 44 ప్రక్కన సర్వే నెంబర్ 458, 545, 555 మూడు సర్వే నెంబర్లలో మొత్తం 13.39 ఎకరాల భూమి ఉంది. అయితే అందులో గత 80 ఏళ్ల నుంచి పెబ్బేరుకు చెందిన 11 మంది రైతుల స్వాధీనంలో ఉండి అనుభవిస్తున్నారు. 13 ఎకరాల 39 గుంటల భూమిలో సర్వే నెంబర్ 458లో 26 గుంటలు భూమి 2002లో జూరాల ప్రాజెక్టు నిర్మాణం కోసం అవార్డు అయింది. అలాగే అదే సర్వే నెంబర్‌లో 2006 సంవత్సరంలో జాతీయ రహదారి విస్తర్ణ కోసం భూసేకరణలో భాగంగా ఎకరా 24 గుంటల భూమి పో యింది. భూమి కోల్పోయి బాధిత రైతులకు అప్పట్లో ప్ర భుత్వం నష్ట పరిహారం కూడా అందజేసింది. మిగులు భూముల్లో కొందరు రైతులు సేద్యం చేస్తుండగా రోడ్డు ప్రక్కన ఉన్న వాటిలో వెంచర్లు వేసి ప్లాట్లను అమ్ముకు న్నారు. దాదాపు 400 మంది ప్లాట్లను కొనుగోలు చేశారు.

ఇనాందారుల ఎంట్రీతో..

అసలు భూమికి ఏలాంటి సంబంధం లేని ముగ్గురు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు ఈ భూమిపై కన్నెసి ఎంట్రీ ఇచ్చారు. సర్వేనెంబర్ 458, 545, 555 సర్వేనెంబర్‌లోని భూమి 1954-55 సంవత్సరంలోని కస్రా పహనిలో తమ పేర్లు ఉన్నాయని మా వారసులకు చెందిన ఇనాం భూమి అని ప్రభుత్వ అధికారుల అండదండలతో ఓఆర్‌సీ సంపాదించారు. కాస్తులో ఉన్న రైతులకు బాధితులకు తెలియకుండా ఓఆర్‌సీ ఇచ్చి తహసీల్దార్ కార్యాలయానికి ఫైల్ పంపడంతో విషయం తెలుసుకున్న బాధితులు ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రెవెన్యూ ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి భూమిలపై అవగాహన ఉన్న అధికారుల ప్రోత్సాహంతోనే కొత్త వ్యక్తులు ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

రికార్డులు చూసి కొనుగోలు చేశాం



పెబ్బేరులో శివారులో 458 సర్వే నెంబర్‌ను అన్ని రికార్డులు పరిశీలించి 15 ఏళ్ల క్రితం బాలకిష్టి వారసులతో కొనుగోలు చేసి గ్రామ పంచాయతీలో పర్మిషన్ తెచ్చుకున్నాం. ప్లాట్లను అమ్ముకున్నాం. ధరణిలో కూడా మా పేరు మీదనే ఉంది. ఇప్పుడు ఇలా చేయడం కరెక్టు కాదు.

- గోనెల నరేష్, వ్యాపారి

అధికారుల తప్పిదం

పెబ్బేరు శివారులోని 458, 545, 555 సర్వే నెంబర్లలో మొత్తం 13 ఎకరాల 39 గుంటల భూమి ఉండగా వాటిలో 26 గుంటల భూమి జూరాల కాల్వకు, ఎకరా 24 గుంటల భూమి జాతీయ రహదారి విస్తర్ణకు అవార్డు కాగా, మిగిలిన 11 ఎకరాల 29 గుంటల భూమి మాత్రమే ప్రస్తుతం ఉంది. అయితే అధికారులు మాత్రం మొత్తం 13 ఎకరాల 39 గుంటల భూమికి ఎలా ఓఆర్‌సీ (అక్యూపెన్సిరైట్ సర్టిఫికెట్)ఎలా ఇస్తారని బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఏది మోకాపై విచారణ చేయకుండా ఓఆర్‌సీ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ నగేష్‌కు బాధితులు ఫిర్యాదు చేయడం దీనిపై అప్పీల్‌కు వెళ్లండని చెప్పినట్లు బాధితులు తెలిపారు. అధికారుల తప్పిదం వల్ల వందలమంది బాధితులు లబోదిబోమంటున్నారు.

తాత్కాలికంగా ఇంప్లిమెంట్ నిలిపి వేశాం

ఆ భూమికి చెందిన రైతులు ఇయరింగ్‌కు వచ్చినప్పుడు మాకు ఎలాంటి డాక్యుమెంటు చూపలేదు. వారికి ఆ భూమి ఎలా వచ్చింది. అనే విషయం పేపర్ల ఓఆర్‌సీ రూపంలో మాకు ఇవ్వలేదు. కాబట్టి మేము ఇచ్చిన ఓఆర్‌సీపై అప్పీల్‌కు వెళ్లవచ్చు. జాయింట్ కలెక్టర్‌తో ప్రూఫ్ చేసుకోవచ్చు. లేదా హైకోర్టుకు వెళ్లవచ్చు. ప్రస్తుతం ఇప్లింటేషన్ నిలిపి వేశాం.

- పద్మావతి, ఆర్డీవో

విజ్ఞానం..వినోదం..నైతికత పెంపొందించేలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ ప్రారంభం
- ప్రతీ రోజు ఆయా అంశాలపై అవగాహన
- ఈ నెల 28 వరకు కార్యక్రమాలు



మరికల్ బాలికల పాఠశాలలో బొమ్మలను తయారు చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

నారాయణపేట, జూలై 22: విజ్ఞానం.. వినోదం.. నైతికత పెంపొందించేలా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నూతన జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరుతో సోమవారం నుంచి ఈ నెల 29 వరకు రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యాచరణను రూపొందించారు. నారాయణపేట జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌ఘనీ, జిల్లా సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్ పర్యవేక్షణలో జిల్లాలో ఉపాధ్యాయులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు334, ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలు 86, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 76 ఉండగా 52,953 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రోజుకు ఒక అంశం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మొక్కల పెంపకం, చరిత్ర కట్టడాలు, పోషక ఆహారంపై అవగాహన కల్పిస్తారు. నిత్యం ఒకటి నుంచి రెండు వరకు, మూడునుంచి ఐదు వరకు, ఆరునుంచి పదవతరగతి వరకు వేర్వేరు కార్యక్రమాలు అమలు చేస్తారు. సోమవారం నీటిని ఎలా ఆదా చేయాలి, ఇతరులకు సాయం ఎలా చేయాలి, ఆహారం కూరగాయల వినియోగం వల్ల ప్రయోజనాలు, వ్యర్థాలతో బొమ్మల తయారీపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. నేడు పాఠశాలల్లో అమలు చేసే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు ప్రదర్శించాలి. సదస్సులు నిర్వహిస్తూ కథలు చెప్పాలి. 24న క్రీడా దినోత్సవం నిర్వహించడంతో విద్యార్థులకు ఆటలు ఆడించడం, ఆటల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలి. 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో వివిధ భాషలు, వేషధారణలు, చిత్రలేఖనం, హస్తకళలు, నృత్యాలు, వస్త్రదారాణల పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవంలో కోడింగ్ చాలెంజ్, జీవాధరలు, వృక్ష, జంతు జాతులపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులతో చారిత్రక స్థలాలను సందర్శించి పలురకాల వర్క్‌షాపులు నిర్వహించాలి. 27న స్కూల్ న్యూట్రిషన్ డే నిర్వహణలో భాగంగా విద్యార్థులతో ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల భాగ్యస్వామ్యంతో మొక్కలు పెంపకం, కూరగాయల తోటల పెంపకం, వాటి సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించనున్నారు. 28న సామాజిక భాగ్యస్వామ్య దినోత్సవంలో భాగంగా విద్య, విద్యేతర అంశాలల్లో అందరిని భాగ్యస్వామ్యం చేయాలి.



ధన్వాడ బాలికల పాఠశాలలో..

మద్యానికి బానిసై దొంగతనాలు

- మూడు ఇళ్లలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి రిమాండ్, 19 తులాల బంగారం స్వాధీనం
- విలేకర్ల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

గద్వాల క్రైం, జూలై 22 : మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసైయాడు. ఆర్థిక ఇబ్బందులకు గురికావడంతో ఇళ్లల్లో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. పగటిపూట తాళం వేసిన ఇళ్లను ఎంచుకొని దొంగతనం చేసేవాడు. గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 2024, జూన్ 17న కుర్వ బుడ్డ నర్సింహులు రెండు ఇళ్లలో చోరీ చేసి పది తులాల బంగారం, రూ.80వేల నగదును చోరీ చేశాడు. అలాగే 2024, జూన్ 20న గద్వాల పట్టణంలోని పాండురంగ వీధిలో మిటికిల వీరప్రతాప్ ఇంటిలో చోరీ చేసి 20తులాల రెండు గ్రాముల బంగారం, రూ. 2,75,000 నగదు చోరీ చేశాడు. అలాగే 2024, జూలై 18న మల్దకల్ మండలం మద్దెలబండలోని ఓ ఇంటిలో దొంగతనానికి యత్నించాడు. అయితే నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం దొంగతనం చేసేందుకు గద్వాలకు రాగా కొత్త బస్టాండ్ సమీపంలో పట్టుకొని నిందితుడి నుంచి 26తులాల ముద్ద బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. అలాగే ఇనుపరాడ్, స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసుల ఛేదింపులో ప్రతిభ చూపిన పోలీస్‌అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

● గుడి హుండీ దొంగతనం కేసును ఛేదించిన అయిజ పోలీసులు

జల్సాలకు అలవాటు పడి గుడిల్లో హుండీలను దొంగతనం చేస్తున్న నలుగురిలో ఇద్దరు నిందితులను అయిజ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలనూ ఆయన వెల్లడించారు. 2024, జూలై 20న అయిజకు చెందిన బుడగ జంగాల మారెప్ప, అతడి స్నేహితుడు బుడగ జంగాల ఉరుకుంద మరో ఇద్దరు కలిసి అయిజ మండలం చిన్నతాండ్రపాడు వద్దగల సత్యమాంబ గుడిలో హుండీని పగులగొట్టి డబ్బులను దోచుకెళ్లారు. వీరు రాయిచూర్ రోడ్డు వైపు పారిపోతున్న క్రమంలో అయిజ పోలీసులు వారిని పట్టుకొని విచారించగా దొంగతనం ఒప్పుకున్నారు. అలాగే గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చాగదోణ గ్రామంలోని రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో కూడా గత నెల 28న దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిని కూడా అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఇందులో ప్రతిభ చూపిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో గద్వాల సీఐ భీంకుమార్, శాంతినగర్ సీఐ టాటా బాబు, గద్వాల పట్టణ, గట్టు ఎస్ఐలు శ్రీనివాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పోటెత్తిన వరద

- పెరిగిన సందర్శకుల తాకిడి
- నదీ పరీవాహన ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరిక జారీ




జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు శ్రీశైలం వైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

ధరూరు, జూలై 22 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పోటిత్తింది. ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి భారీగా వరద నీరువచ్చి చేరుతుండటంతో జూరాల జలాశయంలో 37 గేట్లు ఎత్తివేశారు. దాంతో సందర్శకుల తాకిడి పెరిగింది. నదీ పరీ వాహక ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూరాల అధికారులు సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకుంటూ చేపల వేటకు వెళ్లే జాలర్లు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. దీంతో ఐదు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన కొనసాగుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం జూరాల జలాశయంలో 317.500 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 7.654 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రాజెక్టులో 1,69,000 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదుకాగా, 37 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి వేసి 1,45,410 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 29,307 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఐదు యూనిట్ల ద్వారా 140 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1300, ఎడమకాల్వకు 640, కుడి కాలువకు 584, మొత్తం ప్రాజెక్టు నుంచి 1,78,783 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు 'ఆంధ్రజ్యోతి' తెలిపారు.



జూరాల వద్ద సందర్శకులు



గేట్ల వద్దకు వెళ్లిన సందర్శకులను వెనుకకు పంపుతున్న పోలీసులు

డీఎస్సీ పరీక్షకు 39మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 22 : డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా కొనసాగుతోంది. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ధర్మపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాల, క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో పరీక్షలు జరుగుతున్నాయి. ధర్మపూర్ జేపీఎన్‌సీఈ పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 183 మంది అభ్యర్థులకు గాను 177మంది హాజరుకాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులకు గాను 164 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 185 మందికి గాను 184 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 184మంది గాను 168 హాజరుకాగా 16 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 39 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

ఐదుగురిపై కేసు నమోదు

రాజోలి, జులై 22 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ సోమవారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పలువురు మద్యం తాగుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం మధ్యాహ్నం ఐదుగురిని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. రూ. 1000 వరకు జరిమానా పడుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

వచ్చేనెల 9న వర్గీకరణపై ఢిల్లీలో మహాధర్నా

పాలమూరు,జూలై22 : ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మాదిగల మహాధర్నా చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మహాధర్నా కరపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డితో కలిసి విడుదల చేశారు. వర్గీకరణ న్యాయమైన డిమాండని ఎమ్మెల్యే అన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వై.నరేష్, ఆర్.కృష్ణ, గోవర్ధన్, నరసింహులు, ఆశన్న, జయన్న పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువతుల అదృశ్యం

మిడ్జిల్/ఊర్కొండ, జూలై 22: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు యువతులు అదృశ్యమైయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 సంవత్సరాల యువతి అదృశ్యమైంది. సోమవారం యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఓ ఓ గ్రామానికి చెందిన యువతి ఈ నెల 13న హైదరాబాద్‌లోని తన మేనమామ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. కానీ, మేనమామ ఇంటికి వెళ్లలేదు. ఆ రోజు నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

నేడు పాలమూరుకు కల్కి సినిమా డైరెక్టర్

మహబూబ్‌నగర్, జూలై 22: పాలమూరులోని తిరుమల థియేటర్‌లో మంగళవారం కల్కి సినిమా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు మూవీ డైరెక్టర్ నాగ్ అశ్విన్, సినిమాలో ముఖ్యపాత్ర పోషించిన బుజ్జి కారు రానుంది. ఇందుకోసం థియేటర్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం

ఊర్కొండ, జూలై 22: ఊర్కొండ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పాము కలకలం రేపింది. కార్యాలయం సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజువారిగా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి రికార్డు గదిలోకి పాము వెళ్లడాన్ని గమనించి సిబ్బందికి తెలియజేశారు. దాంతో అప్రమత్తమైన సిబ్బంది గదిలోని రికార్డులను బయట పెట్టి పాము కోసం వెతికినా దొరకలేదు. గదిలో ఉన్న రంధ్రాల ద్వారా వెళ్లి ఉంటుందని సిబ్బంది చర్చించుకున్నారు. కార్యాలయం పాత పాడుబడిన పశువైద్యశాల భవనంలో ఉండటంతో విష పురుగుల సంచారం పెరిగిందని అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

మహబూబ్‌నగర్,జూలై 22: ఆటోలో ప్రయాణించిన మహిళ రెండున్నర తులాల బంగారు నగలున్న పర్సును జారవిడుకుని ఆటో దిగి వెళ్లిపోయింది. ఆటోలో పర్సును గమనించిన డ్రైవర్ నేరుగా పోలీసులకు ఆ పర్సును అప్పగించి తన నిజాయతీని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సుజాత అనే మహిళ శాంతన్నకు చెందిన ఆటో ఎక్కారు. షాషాబ్‌గుట్ట వద్ద దిగిపోయిన ఆమె ఆటోలో నగలున్న పర్సును మరిచిపోయారు. ఆ తరువాత ఆటోడ్రైవర్ పర్సును గమనించి అందులో చూడగా నగలు ఉండటంతో తన ఆటోలో ఎక్కిన మహిళ కోసం చూసినా ఆమె రాకపోవడంతో నేరుగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విజయ్‌ను కలిసి పర్సు అప్పగించాడు. పోలీసులు నగలు పోగొట్టుకున్న బాధిత మహిళ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు రావడంతో ఆమెకు ఆటోడ్రైవర్ సమక్షంలోనే నగల పర్సును అప్పగించారు.

న్యాయవాదులకు అండగా ఉంటా

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
» న్యాయవాదులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 22 : న్యాయవాదులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేస్తే అవసరమైతే సీఎంతో అపాయింట్‌మెంట్ తీసుకుని మిమ్మల్ని సీఎం వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని తెలిపారు. సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయ వాదులకు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డిలు హెల్త్‌కార్డులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా యెన్నం మాట్లాడారు. నిజమైన పేద న్యాయవాదుల లిస్ట్ ఇస్తే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమమని, అందరూ బాగుండాలి, అందులో మేముండాలనే సిద్ధాంతం కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నేత ఎన్‌పీ.వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, రాంనాథ్‌గౌడ్, జీపీ శ్రీనివాస్‌గౌడ్, ఏజీపీ కుర్మయ్య, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్ ఉన్నారు.

బీకేరెడ్డి కాలనీలో పండ్లు, పూల మొక్కలు పంపిణీ

మహబూబ్‌నగర్ : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని బీకేరెడ్డి కాలనీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి వార్డు ప్రజలకు పండ్లు, పూలమొక్కలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి ఆరు వరకు మొక్కలను పంపిణీ చేశారు. కాగా, మహిళలు మొక్కలను తీసుకెళ్లేందుకు పోటీ పడ్డారు. ట్రాక్టర్‌లో మొక్కలు తీసుకురాగా మహిళలు తమకు నచ్చిన పూలు, పండ్ల మొక్కలు తీసుకునేందుకు ఎగబడ్డారు. మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాత పాలమూరులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పట్టణంలోని పాతపాలమూరులో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పురపాలిక పరిధిలోని పలు వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను రానున్న కాలంలో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు ఉన్నారు.

పిల్లల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఉంది..

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని బోయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుచ్చన్నగౌడ్ స్మారకార్థం ఆయన సతీమణి వనమాల రూ.పది లక్షలతో నిర్మించిన భవనం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే యెన్నం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించామని, ఇక విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత వారిపై ఉందని అన్నారు. అనంతరం ఆయన తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎంఈవో జయశ్రీ, హెచ్ఎం కవిత, కౌన్సిలర్ మోతిలాల్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, దాతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదర్సాలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మహబూబ్‌నగర్ అర్బన్ : మదర్సాలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కమలనెహ్రూ కాలనీలో గల మదర్సా ఇస్లామియా ఖాశీఫ్ ఉల్ ఉలూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు ఈద్గా కమిటీ ఉపాధ్యక్షుడు నూరుల్ హాసన్ నివాసంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. టీపీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హదీ, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, నూరుల్‌హాసన్, నాసిర్, బాబర్‌షేక్ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

హన్వాడ : పేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హన్వాడ మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తహసీల్దార్ కిష్ట్యానాయక్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, మహేందర్, కృష్ణయ్య, నర్సిములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం

» జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
» 94 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బాలానగర్, జూలై 22 : బీఆర్ఎస్ వాళ్లది కొబ్బరికాయలు కొట్టే ప్రభుత్వం.. తమది ప్రజా ప్రభుత్వమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశమందిరంలో 94 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలానగర్ నుంచి జడ్చర్ల మండలంలోని గంగాపురం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడితే బీఆర్ఎస్ పార్టీ సొమ్మొకరిది సోకొకరిది అన్నవిధంగా విమర్శలు చేస్తున్నారని, సోషల్ మీడియాలో ఆ పార్టీ ప్రచారాలు వాట్సాప్‌కు పరిమితమయ్యాయే తప్పా పని చేయలేదన్నారు. వచ్చే సంవత్సరం రూ.రెండు కోట్ల నిధులు రోడ్ల అభివృద్ధి కోసం వెచ్చిస్తామన్నారు. ప్రతీ రోజూ తాను జడ్చర్ల అభివృద్ధి కోసమే పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి కష్టం రాకూడదని, ఎవరైనా తప్పు చేస్తే మాత్రం వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో 70శాతం రోడ్ల పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తమ కార్యకర్తలే షూస్ అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాజాపూర్ : మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలో నూతనంగా మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



రంగారెడ్డిగూడ గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మిడ్జిల్, జూలై 22 : గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గౌస్, పార్టీ జిల్లా నాయకుడు బరిగెల వెంకటయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు రాజారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నర్సింహ్మా, సత్యంగౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్ తదితరులున్నారు.

టీఎల్‌ఎం పద్ధతిలో బోధన భేష్

భూత్పూర్/జడ్చర్ల, జూలై 22 : టీఎల్‌ఎం పద్ధతిలో బోధన భేష్ అంటూ ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం ఆయన భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్ యూపీఎస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 'శిక్ష సప్తాహ్' అనే కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న టీఎల్‌ఎం మేళా ద్వారా విద్య బోధనా పద్ధతులను పరిశీలించారు. ఏఎంవో వెంట ఎంఈవో నాగయ్య, సీఆర్‌పీ ఠాకూర్, ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా, జడ్చర్లలోని ఇందిరానగర్ కాలనీ, కావేరమ్మపేటలోని ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని ఎంఈవో మంజులదేవి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎంను ఎంఈవో మంజుల దేవికి ప్రదర్శించారు. హెచ్‌ఎంలు చంద్రకళ, మధుసూదన్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెబ్‌పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి నేడు అప్పీళ్ల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 22 : జీవో 317 వెబ్‌పోర్టర్ ద్వారా అప్పీళ్లు చేసుకున్న ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో గల గాంధీ హాల్‌లో అప్పీళ్ల పరిశీలన ఉంటుందని మహబూబ్‌నగర్ డీఈవో ఏ.రవీందర్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. స్పౌజ్, మెడికల్, స్థానికత(లోకల్) దరఖాస్తు చేసుకున్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా 24న మ్యూచువల్, ఇతర అప్పీళ్లు చేసుకున్న వారు పూర్తి ఆధారాలతో రావాలని సూచించారు. హాజరయ్యే ఉపాధ్యాయులు ఒకటి నుంచి ఏడో తరగతి వరకు బోనఫైడ్, స్థానికత, స్పౌజ్ ధ్రువపత్రాలు విధిగా తీసుకొని ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని ఆయన కోరారు.

వీవోల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల, జూలై 22 : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఐకేపీ వీవోలు, సీఐటీయూ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్తయ్య మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా ఐకేపీ వీవోలు సెర్ప్ సంస్థలో పనిచేస్తున్నా వారికి కనీస వేతనం కూడా నిర్ణయించడం లేదన్నారు. వీవోల ఉన్న జీవో 58ని రద్దు చేయాలని, ఐడీకార్డులు, బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని, హెల్త్‌కార్డులు గుర్తింపు కార్డులు, ప్రతీ గ్రామ సంఘానికి ల్యాప్‌ట్యాప్‌లు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే పీఏకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వసియాబేగం, మంజుల, రమాదేవి, కవిత, సుశీల, భాగ్యమ్మ, లీలావతి, రమేష్, ఆంజనేయులు, భీమయ్య, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులున్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

పాలమూరు, జూలై 22 : ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు డి.లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన సేవా సంఘం, అనుబంధ సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని ప్రతీ ప్రైవేటు స్కూల్‌లో అమలు చేయాలన్నారు. ప్రైవేటు స్కూల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలన్నారు. గిరిజన రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులను అరికట్టాలన్నారు. గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో రాము, మోహన్‌లాల్, ప్రతాప్, కె.రమేష్, కిషన్‌పవార్, ఆర్.రమేష్, గోవర్ధన్, నారాయణ, బలరాం, సంజునాయక్, సురేందర్, వెంకటేష్, నరేష్, అఖిల్, శశికుమార్, శంకర్, సంతోష్‌లు పాల్గొన్నారు.

పాత ఇళ్లను పరిశీలించిన అధికారులు

మిడ్జిల్/చిన్నచింతకుంట/దేవరకద్ర, జూలై 22 : మిడ్జిల్ మండల కేంద్రంలోని పాత ఇళ్లను సోమవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ రాజునాయక్, ఎస్సై శివనాగేశ్వరనాయుడులు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఐదు ఇళ్లను పరిశీలించి వారికి సూచనలు చేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గౌస్, పంచాయతీ కార్యదర్శి సాయన్న తదితరులున్నారు. అదేవిధంగా, కౌకుంట్ల మండలంలోని అప్పంపల్లి, ముచ్చింతల గ్రామాల్లో పాత ఇళ్లను కౌకుంట్ల తహసీల్దార్ ఎల్లయ్య, చిన్నచింతకుంట ఎస్సై శేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఇంట్లో ఉన్నవారికి పలు సూచనలు చేశారు. దేవరకద్ర మండలంలోని నాగారం గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పలు ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రజలు తడిసిన విద్యుత్ స్తంభాలు, పాత గోడలను ముట్టుకోవద్దని, పాత ఇళ్లల్లో ఉండొద్దన్నారు. అదేవిధంగా పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని, చెరువుల వద్దకు వెళ్లొద్దని సూచించారు.

శిథిలావస్థకు చేరుకున్న ఇంటి యాజమానులకు నోటీసులు

జడ్చర్ల : మునిసిపల్ పరిధిలోని మూడవ వార్డులో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో ఉండొద్దని సూచిస్తూ మునిసిపల్ అధి కారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. కార్యక్ర మంలో సూపర్‌వైజర్ శివకుమార్, కృష్ణయ్య, నర్సింహులు, వార్డు ఆఫీసర్ డి.కృష్ణయ్య, సరిత, స్వాతి, ఆర్పీలు ఉన్నారు.



యజమానురాలికి నోటీసు ఇస్తున్న మునిసిపల్ అధికారులు

డప్పు కళాకారులను ఉద్యోగులుగా గుర్తించాలి

భూత్పూర్, జూలై 22 : తమను గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండలంలోని కొత్తమొల్గర గ్రామ డప్పు కళాకారులు సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తాము గ్రామాల్లో డప్పులు వాయిస్తూ ప్రభుత్వాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందిస్తూ వస్తున్నామని ప్రస్తుతం తాము ఎలాంటి బతుకుదెరువు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన డప్పు కళాకారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, జీవనభృతి కింద రూ.ఐదు వేలు, 50 ఏళ్లు నిండిన వారికి రూ.మూడు వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు కుమార్, మైబు, రాములు, కురుమూర్తి, తిరుపతయ్య తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవాబ్‌పేట, జూలై 22 : మండలంలోని రుద్రారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తు బదిలీపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులను గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు తమకు మంచి సహకారం అందించారని హెచ్‌ఎం శాంత పేర్కొన్నారు. ఎంఈవో రాజునాయక్, మాజీ సర్పంచ్‌లు లలితమ్మ, లక్ష్మీ, గ్రామస్థులు కృష్ణయ్య, మధుసూదన్‌రెడ్డి, కృష్ణాగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, రాజేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ విజయేందిర బోయి
» వర్షాలపై సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 22 : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. అదేవిధంగా, వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ జానకితో కలిసి ఆమె వర్షాల కారణంగా తీసుకోవలసిన చర్యలపై, జిల్లా జనరల్ ఆసుపత్రిలో, పీహెచ్‌సీలలో జ్వరాల కేసులపై సమీక్షించారు. ప్రతీరోజు జనరల్ ఆసుపత్రిలో రోజు వచ్చే జ్వరాలకు సంబంధించి పాజిటివ్ కేసులపై డాక్టర్లు అప్రమత్తంగా ఉంటూ చికిత్స అందించాలని ఆదేశించారు. మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామం, పట్టణాల్లో డ్రెయిన్‌లలో మురుగునీరు ప్రవహించేలా క్లీనింగ్ చేయాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. తాగునీటి పైప్‌లైన్‌లు లీకేజీ ఉంటే గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు అరికట్టాలని అన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ కూలిపోయే, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండే వారిని తరలించాలని, వర్షం, వరద కారణంగా రోడ్లు, బ్రిడ్జిలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలకు ఇబ్బంది లేకుండా రహదారులు, భవనాల శాఖ, పోలీస్‌శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ, కీటక జనిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి డా.భాస్కర్‌నాయక్, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులకు పంపించి, ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్‌వో కేవీవీ.రవికుమార్ జడ్పీ సీఈవో రాఘవేంద్రరావు, డీఆర్‌డీవో నర్సింహులు తదితరులున్నారు. అంతకుముందు ట్రెజరీ ఉద్యోగి మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

» సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశాలు

పాలమూరు, జూలై 22 : ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆశ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. నెలకు రూ.18వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనే పలు డిమాండ్లతో ఆశాలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. గతేడాది అక్టోబర్‌లో ఆశాలు 15 రోజుల పాటు సమ్మె చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఆరోగ్య కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఆశల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 30న చలో అసెంబ్లీ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆశాల ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేసింది. ఆశా యూనియన్ జిల్లా(సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు దీప్లానాయక్, కిల్లెగోపాల్, బి.చంద్రకాంత్, ఆశ అధ్యక్ష, కార్యదర్శులు సుగుణ, సాధన, యాదమ్మ, పదమ్మ, అలివేలు, జయమ్మ ఉన్నారు.

ఎస్పీ మానవతాదృక్పథం

దివ్యాంగుడి వద్దకే వచ్చి దరఖాస్తు స్వీకరణ



కార్యాలయం బయటకు వచ్చి దివ్యాంగుడితో దరఖాస్తు స్వీకరించిన ఎస్పీ

మహబూబ్‌నగర్, జూలై 22 : ఎస్పీ జానకి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజా ఫిర్యాదులను పురస్కరించుకుని తన కార్యాలయానికి వచ్చిన ఓ దివ్యాంగుడు మెట్లు ఎక్కి ఎస్పీని కలిసేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ఆమె కిందికి దిగి దివ్యాంగుడి వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అతని సమస్య అడిగి తెలుసుకున్న ఆమె వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అంగవైకల్యులు ఎవరు స్టేషన్‌కు వచ్చినా తక్షణమే వారికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం ప్రజా ఫిర్యాదులను పురస్కరించుకుని 15 మందితో ఫిర్యాదులు అందుకున్నారు.

కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌ల తొలగింపు

ఎస్పీ జానకి ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు ఫోర్ వీలర్‌లకు సంబంధించి గ్లాస్‌లకు వేసుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు. బ్లాక్ ఫిల్మ్ వాడటం చట్టరీత్యా నేరమని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎవరైనా తమ కార్లకు బ్లాక్ ఫిల్మ్ ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు.

రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యం

» రావులపల్లి చెక్‌డ్యామ్ పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



అలుగు పారుతున్న రావులపల్లి వాగులోని చెక్‌డ్యామును పరిశీలించి మొక్కుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, జూలై 22 : రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం మొత్తంలో ఎనలేని చెక్‌డ్యాములు నిర్మించారని, ముఖ్యంగా దేవరకద్ర నియోజవర్గంలో దాదాపు అన్ని మండలాల్లో వాగులు, వంకల్లో సుమారు 30కి పైగా చెక్‌డ్యాములను నిర్మించారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రావులపల్లి గ్రామ శివారులో రెండేళ్ల క్రితం రూ.3.8కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యాము నుంచి అలుగు పారుతుండగా స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అలుగు వద్ద పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్మించిన చెక్‌డ్యాముల ద్వారా చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని బోరుబావుల్లో భూగర్భజలం పెరిగి వేల ఎకరాల్లో రైతులు బంగారు పంటలను పండించుకున్నారని అన్నారు. సీసీకుంట వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌లో ఒకప్పుడు తాను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఈత కొట్టిన దృశ్యాలను కేసీఆర్ మీడియా ద్వారా తెలుసుకొని అసెంబ్లీ సమావేశాల్లో వెల్లడించినపుడు సంతోషాన్ని కల్గించిందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, గోప్లాపూర్ సత్యనారాయణ, యువకులు, రైతులు ఉన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

చిన్నచింతకుంట : మండలంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన గోవులను సోమవారం హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామంలోని లక్ష్మీ గోశాలకు తరలించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసులు, బుచ్చిబాబు తదితరులున్నారు.

మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

దేవరకద్ర : మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డుకు రెండు రోజులు సెలవు ఉంటుందని మార్కెట్ సెక్రటరీ జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో బోనాల పండుగ సందర్భంగా మార్కెట్ దడవాయిల విన్నపం మేరకు మంగళ, బుధవారాలు సెలవు ప్రకటించామన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, దుస్తులు పంపిణీ

జడ్చర్ల : మండలంలోని ఖానాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెటిరో కంపెనీ వారు సోమవారం విద్యార్థులకు బ్యాగులు, రెండు జతల దుస్తులు, నోట్‌బుక్స్, కంపాక్స్ బాక్స్‌లు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు శివ, రవీందర్‌రెడ్డి, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

చిన్నచింతకుంట/అడ్డాకుల/మూసాపేట : చిన్నచింతకుంట, అడ్డాకుల, మూసాపేట మండలాల్లో అర్హత గల రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయా మండలాల ఏవోలు రాజేష్‌ఖన్నా, పి.శ్రీనివాసులు, రాజేందర్‌రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 28 వరకు పట్టాబుక్కు వచ్చిన రైతులు, ఇంతవరకు రైతు బీమా చేసుకోలేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతు బీమా నమోదు ప్రారంభం

రాజాపూర్ : మండలంలో 18 నుంచి 59 సంవత్సరాలు వయస్సు కల్గి, అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో నరేందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతువేదికలో రైతు బీమా నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మూడు తరగతులు అంగన్‌వాడీలకు ఇవ్వడం సరికాదు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ప్రభుత్వం ఒకటి నుంచి మూడో తరగతి వరకు అంగన్‌వాడీలకు ఇవ్వడం సరికాదని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలను అంగన్‌వాడీల్లో కలిపి ప్లేవే పద్ధతిలో చెప్పడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కల్గుతుందన్నారు. ఈ విధానం వల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితి ఉందన్నారు. అంగన్‌వాడీలను పాఠశాలల్లో విలీనం చేయాలని, పూర్వ ప్రాథమిక విద్యా స్థాయిని ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలన్నారు.

మేధోశక్తిని పెంపొందించాలి

కోయిలకొండ, జూలై 22 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల మేధోశక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో కాళప్ప సూచించారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రాథమిక పాఠశాలలో మినీ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, హెచ్‌ఎం నర్సిములు, ఏపీవో నర్సయ్య, సీఆర్‌పీ శంకర్, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు పాల్గొన్నారు.

17 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

కోయిలకొండ, జూలై 22 : మండలంలో 17 గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో కాళప్ప తెలిపారు. బదిలీ అయిన కార్యదర్శులు రిలీవ్ అయ్యారని వారి స్థానంలో ఇతర గ్రామాల నుంచి వచ్చిన కార్యదర్శులు బాధ్యతలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

గండీడ్ ప్రత్యేకాధికారిగా చత్రునాయక్

గండీడ్, జూలై 22 : మండల ప్రత్యేకాధికారిగా చత్రునాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి, స్వాగతించారు. ఈ సందర్భంగా చత్రునాయక్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి, సత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా, ఎంపీవోగా బి.నరేందర్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గండీడ్‌లో విధులు నిర్వహించిన ఎంపీవో శంకర్ నాయక్ మహబూబ్‌నగర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నరేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఏడుగురు గ్రామ కార్యదర్శులు బదిలీ కాగా ధర్మాపూర్, కంచన్‌పల్లి, అన్నారెడ్డిపల్లి గ్రామాలకు నూతన కార్యదర్శులు సోమవారం బాధ్యతలు చేపట్టారు.

కళాశాలలో వనమహోత్సవం

అడ్డాకుల, జూలై 22 : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సోమవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో హతహర్‌బేగం, ఈసీ రమేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేశ్ మొక్కలు నాటారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతిలో ఇరుక్కుపోయిన బస్సు

» గంట పాటు నిలిచిన రాకపోకలు

నవాబ్‌పేట, జూలై 22 : మండలంలోని తిమయ్యపల్లి రహదారి అధ్వానంగా మారింది. మూడురోజులుగా ముసురు వర్షం కురవడంతో రహదారిపై గోతులు ఏర్పడి వాహనచోదకులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. సోమవారం ఉదయం నవాబ్‌పేటకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు గోతిలో ఇరుక్కుపోవడంతో సుమారు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు ట్రాక్టర్ సహాయంతో బస్సును బయటకు తీశారు. ఇదిలా ఉండగా తమ గ్రామానికి మంజూరైన బీటీ పనులను స్థానిక అధికారులు చొరవ తీసుకుని త్వరగా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆర్టీసీకి బడ్జెట్ కేటాయించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 22 : ఆర్టీసీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీకి బడ్జెట్ కేటాయించి ఆదుకోవాలని, కార్మికులకు ఆదాయ పన్నులో మినహాయింపు ఇవ్వాలన్నారు.

26న రఫియొద్దీన్ షా ఖాద్రీ ఉర్సు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 22 : జిల్లా కేంద్రం రామయ్యబౌలిలో గల హజ్రత్ షేక్ రఫియొద్దీన్ షా ఖాద్రీ దర్గా, షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్ షర్పీ ఉర్సు వేడుకలు ఈ నెల 26న నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లీ షేక్ సైఫొద్దీన్ తెలిపారు. సోమవారం రామయ్యబౌలి కమ్యూనిటీ హాల్‌లో ఉర్సు ఉత్సవాలపై సమావేశం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు షేక్ బుర్హాన్‌ఖాద్రీ, సాదుల్లా, ఇబ్రహీం, మజహర్, ఖాదర్, అఖిల్, ఆసీఫ్, సోహెల్, ఓవేజ్ పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ మండల చైర్మన్‌గా జానునాయక్



నియామక పత్రం అందుకుంటున్న జానునాయక్

నవాబ్‌పేట, జూలై 22 : ఎస్టీ సెల్ మండల చైర్మన్‌గా జానునాయక్, ఉపాధ్యక్షులుగా పుల్యానాయక్‌ను నియమిస్తు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జానునాయక్, పుల్యానాయక్‌లు హైదరాబాద్‌లో బెల్లయ్యనాయక్‌ను కలిసి నియామక పత్రం అందుకున్నారు.